## క్లుప్తంగా

### నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గుడిబండ: మండల పరిధిలోని మోరుబాగుల్ సచివాలయం పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు.

### వేధిస్తున్నారని మహిళ ఫిర్యాదు



పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మహిళా కార్మికురాలు

చిలమత్తూరు: తనపై చేయిచేసుకోవడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించారంటూ టెక్స్‌పోర్ట్ గార్మెంట్స్‌లో పనిచేసే మహిళా కార్మికురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టెక్స్‌పోర్ట్ గార్మెంట్స్ హెచ్‌ఆర్‌టీంలో పనిచేస్తున్న కళ్యాణ్ తనను తరచూ వేధింపులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

### వర్షం కోసం పూజలు



రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలో సోమవారం కనుమ నంది విగ్రహం వద్ద వర్షం కోసం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నంది విగ్రహాన్ని వెన్నెతో అలంకరించి 101 బిందెలతో గంగాజలంతో అభిషేకించారు.

### సమస్యలు పరిష్కరించండి



సబ్‌కలెక్టర్ కార్తీక్‌కు సమస్య వివరిస్తున్న ఎంపీపీ

అగళి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డివిజన్‌స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి కూడా కార్యక్రమంలో పాల్గొని సబ్‌కలెక్టర్‌తో కలసి ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని అధికారులను సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

### శ్రీమన్నారాయణ అష్టాక్షరి క్షేత్రానికి బండ తరలింపు

హిందూపురం అర్బన్: కాకినాడలో రూపుదిద్దుకోనున్న శ్రీమన్నారాయణ అష్టాక్షరి క్షేత్రానికి 150 టన్నుల తెల్లటి బండ రాయిని ప్రత్యేక భారీ వాహనంలో తరలిస్తున్నారు. శ్రీమన్నారాయణ విగ్రహ తయారీకి దీన్ని వినియోగించడానికి కర్ణాటకలోని హోసకెరె నుంచి కాకినాడకు తరలిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హిందూపురం - లేపాక్షి మీదుగా 44వ జాతీయ రహదారికి చేరుకొని అక్కడి నుంచి జాతీయ రహదారి మీదుగా తీసుకెళ్తున్నట్లు చెప్పారు.



రొద్దం: ఆర్ మరువపల్లిలో సాయిబాబా విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



మడకశిర: సాయినాథుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



హిందూపురం: బెస్త భవన్‌లో పూజల్లో పాల్గొన్న సభ్యులు



చిలమత్తూరు: విశేష అలంకరణలో సాయిబాబా



పావగడ: అలంకరణలో షిరిడి సాయిబాబా



పెనుకొండ: అలంకరణలో షిర్డీసాయిబాబా

# గురుభ్యోనమః

గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో ఉదయం నుంచే షిరిడీసాయిబాబాతో పాటు ఇతర ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. ముఖ్యంగా సాయిబాబా ఆలయాలు సాయి నామస్మరణతో మార్మోగాయి. వివిధ ఆలయాల్లో దాతల సహాయంతో భక్తులు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

సాక్షిబృందం:



హిందూపురం: శేషసాయి సంస్థాన్ ఆలయంలో అలంకరణలో బాబా



పరిగి: సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు



అమరాపురం: సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



లేపాక్షి: ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



పెనుకొండ రూరల్: దుద్దేకుంట క్రాస్ వద్ద..



గోరంట్ల: బూడిగద్దపల్లి సమీపంలో....

# సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'



అగళి: నరసంబూది సచివాలయంలో ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అగళి: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నాం. సాంకేతిక కారణాలతో ఎవరైనా పథకాలకు దూరమయ్యారేమో తెలుసుకొని న్యాయం చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టాం' అని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నరసంబూది గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ జగనన్న సురక్ష లాంటి కార్యక్రమాన్ని దేశంలో ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతి, కృష్ణప్ప, కన్వీనర్ మహేంద్రప్ప, ఎంపీపీ రేణుక , ఎంపీటీసీ మంజుల , తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: జగనన్న సురక్షతో ప్రతి కుటుంబానికి సత్వర న్యాయం జరుగుతుందని మండల ప్రత్యేకాధికారి పద్మమ్మ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయ ఆవరణంలోని 2వ సచివాలయంలో సోమవారం జగనన్న సురక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేసారు. ప్రజలు జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు. తహసీల్దార్ స్వర్ణలత , నగర పంచాయితీ కమీషనర్ వంశీకృష్ణభార్గవ్, వైస్ చైర్మన్ సునీల్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు జేసీఎస్ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, నౌషాద్ తెలిపారు. సోమవారం 7, 24, 25, 26, 27, 29, 30, 31వ వార్డులోని సచివాలయంలో జగనన్న సురక్ష శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మడకశిరరూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ న్యాయం జరుగుతుందని ఎంపీడీఓ సోనీబాయి తెలిపారు. మండలంలోని సీ కొడిగేపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన ఇంటింటా సర్వేను ఆమె పరిశీలించారు.

పరిగి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష పథకం ఉద్దేశమని ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. మండలంలోని ఎర్రగుంటలో సోమవారం సచివాలయ ఉద్యోగులతో, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు సూచనలు, సలహాలిచ్చారు.

**నేడు 'జగనన్న సురక్ష ' ఇలా..**

గోరంట్ల: మండల పరిధిలోని గంగంపల్లి, కమ్మవారిపల్లి గ్రామ పంచాయతీల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథగుప్త పేర్కొన్నారు.

లేపాక్షి: మండలంలోని మానేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్షా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ నరసింహానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.



హిందూపురం: మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి



పెనుకొండలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న దృశ్యం

# జగనన్నతోనే మైనార్టీలకు న్యాయం



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, మొగల్ నూరుల్లా

మడకశిర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే మైనార్టీలకు న్యాయం జరుగుతోందని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మొగల్‌నూరుల్లా తెలిపారు. సోమవారం ఆయన మడకశిరలో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని మసీదులను సందర్శించారు. మసీదులకు సంబంధించిన సమస్యలను తెలుసుకున్నారు. మసీదుల అభివృద్ధిపై మైనార్టీ నాయకులతో సమావేశమై చర్చించారు. ఇమామ్‌ల సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామితో సమావేశమయ్యారు. మైనార్టీల అభివృద్ధిపై తీసుకోవాల్సిన అంశాలను చర్చించారు. రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ అధికారులతో కూడా వారు ఫోన్‌లోనే మాట్లాడి మసీదుల అభివృద్ధి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం హర్‌దిల్‌మే వైఎస్సార్ హమ్‌సబ్ జగన్‌కే సాథ్ కరపత్రాలను ఆవిష్కరించారు.

### వ్యాధులపై అవగాహన కల్పించండి

హిందూపురం టౌన్: కాలానుగుణ మార్పులతో సంభవించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి కేసీ కుల్లాయప్పనాయక్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఎంఎల్‌హెచ్‌పి, సీహెచ్‌ఓలకు వారం రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు, హాజరు వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

### ఎంఈఓగా పద్మప్రియ

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో మండల విద్యాశాఖాధికారిగా పద్మప్రియ సోమవారం స్వీకరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య బోధించేలా చర్యలు చేపడతామన్నారు.

### ఉద్యోగులకు సన్మానం

లేపాక్షి: లేపాక్షిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తు బదిలీపై వెళ్తున్న సీహెచ్‌ఓ హుస్సేన్‌బీ, ఫార్మాసిస్ట్ విశ్వనాథరావు, సూపర్‌వైజర్లు గోవిందప్ప, గంగులమ్మ, కమాండర్ డ్రైవర్ సలీమ్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్లు వెంకటచిరంజీవి, రాజ్‌కుమార్ వారి సేవలను కొనియాడారు.

### అనారోగ్యంతో పీఏసీఎస్ సీఈఓ మృతి

రొద్దం: మండల కేంద్రంలో పోలేపల్లి వీధిలో నివాసం ఉంటున్న పీఏసీఎస్ సీఈఓ పోలేపల్లి శ్రీనివాసులు (57) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజారెడ్డి తదితరులు శ్రీనివాసులు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

### విద్యాభివృద్ధికి కృషి చేయండి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల చదువు పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకుని విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు, సలహాలిచ్చారు.

### భూ సమస్య పరిష్కారం

చిలమత్తూరు: రైతుల అనుభవంలో ఉన్న సుమారు వెయ్యి ఎకరాల అన్‌సెటిల్డ్ భూములు సాంకేతిక సమస్యతో లేపాక్షి హబ్ భూములుగా చూపడంతో చిలమత్తూరు పంచాయతీలోని తమ్ములకుంట గ్రామ రైతులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో రైతులు, రైతు సంఘం నాయకుల ఆందోళనతో తహసీల్దార్ నాగరాజు సాంకేతిక సమస్య తలెత్తిందని గుర్తించి సమస్యను పరిష్కరించడంతో వివాదం సద్దుమణిగింది.

### రూ.55 వేలు పలికిన లడ్డు

సోమందేపల్లి: మండల కేంద్రంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో లడ్డు వేలం పాట జరగ్గా గ్రామానికి చెందిన డీసీ మారుతీ రూ.55 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

### ఆక్రమణల తొలగింపు

హిందూపురం అర్బన్: పట్టణంలోని ప్రైవేటు బస్టాండ్ (పరిగి బస్టాండ్) చుట్టూ మున్సిపాల్టీకి సంబంధించిన అద్దె గదులు ఉన్నాయి. ప్రయాణీకులకు ఇబ్బంది కలిగించేలా కొందరు వ్యాపారులు దుకాణాల ముందు వైపు రేకులను వేసుకొన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశాలతో కొందరు వ్యాపారులు సోమవారం స్వచ్ఛందంగా రేకులు తొలగించుకున్నారు.

### క్రమ శిక్షణతో విద్యనభ్యసించాలి

రొద్దం: పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదవాలని పాఠశాల హెచ్‌ఎం శివరాం అన్నారు. సోమవారం మండల పరిధిలోని తురకలాపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్‌ఎం అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థుల చదువులు, వారి నడవడిక, ప్రవర్తనపై ఉపాధ్యాయులే కాకుండా తల్లిదండ్రుల బాధ్యత ఉండాలన్నారు.

### ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా జయప్ప

పెనుకొండ: పెనుకొండ పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జయప్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

### పంటల బీమా జాబితా విడుదల

గుడిబండ: మండలంలో ఖరీఫ్ 2022 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన పంటల బీమా రైతుల జాబితాను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నట్లు ఏఓ వీరనరేష్ తెలిపారు. సందేహాలుంటే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించవచ్చన్నారు.

### చిచ్చురేపిన క్రికెట్ మ్యాచ్

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని కారుడిపల్లిలో ఆదివారం జరిగిన క్రికెట్ మ్యాచ్ చిచ్చురేపింది. క్రికెట్ మ్యాచ్‌లో గొడవ కారణంగా గ్రామానికి చెందిన ఓ యువకుడు కర్ణాటకకు చెందిన కొంత మందిని సోమవారం రాత్రి పిలిపించి ఆంజనేయులు, అరుణ, లక్ష్మమ్మను తీవ్రంగా గాయపరిచారు. గ్రామస్తులు వారిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

**గుండెపోటుతో వ్యక్తి మృతి**

హిందూపురం రైల్వేస్టేషన్‌లో డోన్ నియోజకవర్గం కుమ్మకొండకు చెందిన సుంకన్న (50) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. వలస కూలి అయిన సుంకన్న బాగేపల్లి వద్ద ఓ తోటలో పనికి ఉంటూ తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చి అక్కడే మృతి చెందాడు.

# క్వారీలో ఇష్టారాజ్యం

- విచ్చలవిడిగా పేలుడు పదార్థాల వాడకం
- గ్రామాల వైపు ఎగిరి పడుతున్న రాళ్లు
- పంటలు పెట్టేందుకూ జంకుతున్న రైతులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



గుట్టలను పేల్చేందుకు వినియోగిస్తున్న పేలుడు పదార్థాలు



రాళ్లను పేల్చేందుకు పనిచేస్తున్న కార్మికులు

చిలమత్తూరు: మండలంలోని హుస్సేన్‌పురం సమీపంలోని క్వారీలో విచ్చలవిడిగా పేలుడు పదార్థాలను వాడుతున్నారు. ప్రమాద హేతువులని తెలిసినా ఇష్టానుసారం వాడుతుండటంతో సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. కూతవేటు దూరంలో గ్రామం ఉన్నా ఎలా క్వారీలకు అనుమతులు మంజూరు చేశారని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

**అనుమతులు తప్పనిసరి**

ఇది అటవీ ప్రాంతం కావడంతో పాటు సమీప గ్రామాల ప్రజలు గొర్రెలు, పశువులను మేపుకోవడానికి అటుగా వెళుతుంటారు. పేలుడు పదార్థాలను ఇష్టానుసారం పడేయటం వల్ల కూడా పేలుడు సంభవించే ప్రమాదం ఉంది. స్థానికంగా పేలుడు పదార్థాలు వాడాలంటే పోలీసుశాఖ అనుమతులు ఉండాలని, అలాగే ఎక్స్‌ప్లోసివ్ శాఖ నుంచి కూడా అనుమతులు ఉండాలని మైనింగ్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

**పొంచి ఉన్న ప్రమాదం**

హుస్సేన్‌పురం వద్ద ఉన్న క్వారీ కమ్ క్రషర్‌తో జనజీవనానికి ఆటంకం కలుగుతోంది.

ముఖ్యంగా క్వారీ యాజమాన్యం వినియోగించే పేలుడు పదార్థాల దెబ్బకు ఇళ్లు అదురుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్వారీ సమీపంలో పంటలు పెట్టేందుకు కూడా రైతులు భయపడుతున్నారు. ఎప్పుడు వారు బండలను పేలుస్తారో తెలియక ఆందోళన పడుతున్నామని, అందుకే పంటల వైపునకు వెళ్లేందుకు సాహసించడం లేదని వాపోతున్నారు. రెండు మీటర్ల మేర హోల్స్ పెట్టి పేలుడు పదార్థాలు ఉంచి పేలుస్తుండటంతో పెద్ద ఎత్తున రాళ్లు గ్రామాల సమీపంలో చుట్టు పక్కల పొలాల్లో పడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందో తెలీని పరిస్థితి.

**నిద్రమత్తులో అధికారులు**

హుస్సేన్‌పురం వద్ద ఉన్న క్వారీ కమ్ క్రషర్ అటవీప్రాంతంలో ఉండటంతో ఆ ప్రాంతం అంతా కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. మండలంలో సుమారు 50 హెక్టార్లలో క్వారీలు నిర్వహిస్తుండగా, నాలుగు చోట్ల క్రషర్ మిషన్లు ఉన్నాయి. ఇవన్నీ ఎర్రకొండ అటవీ ప్రాంత సమీపంలోనే ఉండటం గమనార్హం. అటవీశాఖ అధికారులు, మైనింగ్‌శాఖ నిద్రమత్తులో ఉండటంతోనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న విమర్శలున్నాయి.

**మాకు సంబంధం లేదు**

అనుమతులపై క్వారీ వద్ద నల్లమందు పేల్చేవారిని 'సాక్షి' వివరణ కోరగా 'తాము వచ్చి మూడు రోజులే అయింది... ఈ పేలుడు పదార్థాలకు తమకు సంబంధం లేదని తెలిపారు. అలాగే క్వారీలో జిలిటెన్‌స్టిక్స్‌ను వాడుతున్నారని సమాచారం. ఇదే విషయంపై క్వారీ యాజమాన్యాన్ని వివరణ కోరే ప్రయత్నం చేయగా వారు అందుబాటులోకి రాలేదు.

### పంటలు పెట్టడం మానేశాం



నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. క్వారీ వాళ్లు ఎప్పుడు బాంబులు పెడతారో తెలీదు. దీంతో ఇళ్లలో ఉండటానికి కూడా భయం వేస్తోంది. పంటలు పెట్టడం మానేశాం.. పరిహారం ఇస్తామని చెప్పిన యాజమాన్యం అరకొరగా కొందరికి ఇచ్చి చేతులు దులుపుకుంది. అధికారులు ఎవరూ ఇటు వైపు రారు.. భారీ శబ్దాలతో ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారు.

– అశ్వర్థప్ప, రైతు, హుస్సేన్‌పురం

### ఉన్నతాధికారులకు నివేదిస్తాం

ప్రజలకు హాని కలిగించే విధంగా ఎక్కడా పేలుడు పదార్థాలను వాడకూడదు. తనిఖీలు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

– వేణుగోపాల్, సీఐ

### నాణ్యమైన భోజనం వడ్డించాలి

అమరాపురం: పాఠశాలల్లో ప్రభుత్వం ప్రకటించిన విధంగా మెనూ ప్రకారం జగనన్న గోరుముద్దను సక్రమంగా అందించాలని ఎంపీపీ ఈరన్న తెలిపారు. సోమవారం మండలంలోని హాలుకూరు సమీపంలోని మోడల్ స్కూల్, కేజీబీవీలను ఆయన పరిశీలించారు.